
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 24 నవంబరు 2025



ఇంక్రిమెంట్ల మాయాజాలం!

పంచాయతీరాజ్ విభాగంలో వసూళ్ల పర్వం కొత్త పుంతలు తొక్కుతోంది. ఉద్యోగులకు సర్వీస్ మేటర్‌లకు సంబంధించిన ఫైళ్లు కదలాలంటే ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి, నగదు చెల్లించుకోవాలని చెప్పి మరీ వసూళ్లకు పాల్పడటం రివాజుగా మారింది. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్, విజయవాడ నుంచి ప్రత్యేకంగా డిప్యుటేషన్‌పై తెచ్చుకున్న జూనియర్ అసిస్టెంట్ తమదైన శైలిలో వ్యవహారాలు నడుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఏదైనా పనిపై ఉద్యోగులు కార్యాలయానికి వెళ్లాలంటేనే జేబులు తడుముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

డీపీవో కార్యాలయంలో అవినీతి జలగలు!

- ఇంక్రిమెంట్ల మంజూరుకు ఉద్యోగుల నుంచి నగదు వసూలు!
- తెరవెనుక చక్రం తిప్పుతున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పంచాయతీ ఉద్యోగులు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వేడుకోలు



ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : పంచాయతీరాజ్ విభాగంలో అన్ని కేడర్‌లలో పనిచేసే ఉద్యోగులకు పదోన్నతులు వచ్చినా, రాకున్నా వారి సీనియారిటీని బట్టి ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. ఉద్యోగులు వారు విధుల్లో చేరిన నాటి నుంచి ఆరు, పన్నెండు, పద్దెనిమిది, 24 సంవత్సరాలకు ఒకసారి సాధారణ ఇంక్రిమెంట్లు మంజూరవుతాయి. ఈ ఇంక్రిమెంట్ నెలకు రెండు నుంచి మూడు వేల రూపాయలుగా ఉంటుంది. గతంలో ఉద్యోగులకు ఈ తరహా ఇంక్రిమెంట్ల మంజూరుకు సంబంధించిన ఫైళ్లకు ఎలాంటి నగదు తీసుకోకుండానే అధికారులు ఆమోదం తెలిపేవారు. అయితే కొంతకాలంగా ఈ పద్ధతిని మార్చారు. మీకు ఇంక్రిమెంట్‌లు మంజూరు కావాలంటే కార్యాలయానికి వచ్చి తమను ప్రసన్నం చేసుకోవాలనే కొత్త నిబంధన పెట్టారు. ఏడాదికి రూ. 24వేలకు పైగా ఇంక్రిమెంట్ రూపంలో వస్తుందని, మీఫైలుకు మోక్షం లభించాలంటే మా సంగతి ఏంటని తెరవెనుక బేరాలు పెడుతున్నారు. ఉద్యోగం చేసినంతకాలం ఇంక్రిమెంట్ వస్తుంది కాబట్టి, ఒక ఏడాదిలో ఇంక్రిమెంట్ రూపంలో వచ్చే నగదును తమకు సమర్పించు కోవాలని చెప్పకనే చెబుతున్నారు. దీంతో ఉద్యోగులు ఇదేం పద్ధతని, గతంలో ఇలా ఎప్పుడూ జరగలేదని, ఉద్యోగులకు సర్వీసును బట్టి వచ్చే ఇంక్రిమెంట్‌లను మంజూరు చేసేందుకు నగదు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. అవన్నీ పక్కనపెట్టి అడిగినంత నగదు ఇవ్వవచ్చు కదా అని కొందరు ఉద్యోగులకు మిగతా 6లో..

గంటల తరబడి జూమ్ మీటింగ్‌లు

నవంబరు నెల నుంచి పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్ల వేగవంతం చేస్తారు. ఇంటి పన్నుల వసూళ్లతోపాటు స్వామిత్వ సర్వే, తదితర పనుల్లో పంచాయతీ సిబ్బంది బిజీ బీజీగా ఉంటున్నారు. వరి కోతలు పూర్తయిన తర్వాత ధాన్యం నగదు చేతికి అందితే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఇంటి పన్నుల చెల్లింపులు చేస్తారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమయ్యాయి. కొందరు ఇంటి పన్నులు చెల్లించేందుకు కొన్నిరోజులు గడువు ఇవ్వాలని కోరుతున్నారు. ఈలోగానే ఇంటి పన్నులు వసూలులో ఎందుకు వెనుకబడిపోయారని అధికారులు జూమ్ మీటింగ్‌లు పెట్టి పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నారు. జిల్లా అధికారి రెండు గంటలు, ఆ తర్వాత డివిజన్ స్థాయి అధికారులు మరో గంట, మరికొద్ది సేటికే డిప్యూటీ ఎంపీడీవో(ఈవోపీఆర్‌డీ)లు మరో గంటపాటు ఇంటిపన్నులు, స్వామిత్వ సర్వే, తదితర అంశాలపై రోజులో నాలుగు గంటల పాటు జూమ్ మీటింగ్‌లు నిర్వహిస్తుండటంతో తాము పని చేయడానికి సమయమే ఉండటం లేదని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో జూమ్ మీటింగ్‌లు అధికమయ్యాయని వారు అంటున్నారు.

స్వామిత్వ సర్వేలో అనేక సమస్యలు

స్వామిత్వ సర్వే పూర్తిచేయాలంటే తొలుత ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న భూములను పూర్తిస్థాయిలో సర్వేచేసి, గ్రామాలకు సంబంధించిన హద్దులు నిర్ణయించాలని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రామాల్లోని గృహాలకు సంబంధించిన స్వామిత్వ సర్వేను చేయాల్సి ఉందని, ఈ సర్వే జరిగే సమయంలో సర్వేయర్‌లు, వీఆర్వోలు తప్పని సరిగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. కానీ వారు వివిధ విధుల్లో ఉన్న కారణంగా స్వామిత్వ సర్వేకు అందుబాటులో ఉండటం లేదని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. ఈ విషయంపై అధికారులకు తెలిసినా తమదే తప్పు అన్నట్లుగా చూపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

పొట్టిపాడు టోల్‌ప్లాజా తొలగించేనా?

ఎన్‌హెచ్ అధికారుల కసరత్తు

- విజయవాడ పశ్చిమ బైపాస్ పూర్తికాగానే కార్యాచరణ
- కలపర్రు-పొట్టిపాడు మధ్య 23 కిలోమీటర్ల దూరమే..
- అందుబాటులోకి వెదురుపావులూరు టోల్‌ప్లాజా
- రెండు ప్లాజాల మధ్య దూరం 60 కి.మీ ఉండాలంటున్న కేంద్రం
- ఈ నేపథ్యంలో పొట్టిపాడు తొలగించే యోచన


పొట్టిపాడు టోల్‌ప్లాజా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ పశ్చిమ బైపాస్ అందుబాటులోకి రాగానే ఎన్‌హెచ్-16పై పొట్టిపాడు టోల్‌ప్లాజాను తొలగించేందుకు జాతీయ రహదారుల సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. పశ్చిమ బైపాస్‌లో ప్యాకేజీ-3లో వెదురుపావులూరు దగ్గర నూతనంగా పది లేన్లతో కూడిన టోల్‌ప్లాజాను ఏర్పాటు చేశారు. ప్యాకేజీ-4లో వెంకటపాలెం దగ్గర మరో పది లేన్ల టోల్‌ప్లాజాను ఏర్పాటు చేశారు. ఈ రెండు ప్యాకేజీల బ్యాలెన్స్ పనులు పూర్తై.. రోడ్డు అందుబాటులోకి వచ్చాక ఇవి వినియోగంలోకి వస్తాయి. కాగా, టోల్‌ప్లాజాల విషయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కొంతకాలం కిందట ఓ ప్రకటన చేశారు. ఎక్కడ పడితే అక్కడ టోల్‌ప్లాజాలు లేకుండా ప్రతి 60 కిలోమీటర్ల పరిధిలో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా పొట్టిపాడు టోల్‌ప్లాజాను తొలగించాలని ఎన్‌హెచ్ భావిస్తోంది. కేంద్ర స్థాయిలో కూడా గ్రీన్‌సిగ్నల్ రావటంతో తొలగింపునకు రంగం సిద్ధమైంది.

ఎందుకీ గందరగోళం?

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్‌హెచ్-16పై కలపర్రు దగ్గర ఓ టోల్ ప్లాజా ఉంది. ఆ తర్వాత పొట్టిపాడు దగ్గర మరో టోల్‌ప్లాజా ఉంది. ఈ రెండు టోల్‌ప్లాజాల మధ్య 23 కిలోమీటర్ల దూరం ఉంది. చిన్న అవుటపల్లి నుంచి విజయవాడ పశ్చిమ బైపాస్ ప్రారంభమవుతుంది. పొట్టిపాడు టోల్‌ప్లాజా నుంచి వెదురుపావులూరు టోల్‌ప్లాజా వరకు 19 కిలోమీటర్ల దూరం ఉంది. కాబట్టి మధ్యలో ఉన్న మిగతా 6లో..

సుబ్బారాయుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

6

అనధికారికంగా భక్తులను దర్శనానికి తీసుకువెళుతున్న హెడ్ కానిస్టేబుల్ గురువులను హెచ్చరిస్తున్న ఈవో శీనానాయక్



అనధికార దర్శనాలకు బ్రేక్!

దుర్గగుడిలో దర్శనానికి భారీగా పోలీస్ సిఫార్సులు

- రాజమార్గంలో యథేచ్ఛగా తీసుకెళ్తున్న ఆ శాఖ సిబ్బంది
- అడ్డుకున్న ఈవో శీనానాయక్
- సీపీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక

ఇంద్రకీలాద్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో పోలీస్‌శాఖ సిఫార్సులతో యథేచ్ఛగా జరుగుతున్న అనధికార దర్శనాలకు ఈవో బ్రేక్ వేశారు. వివరాల్లోకి వెళితే... దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దుర్గమ్మను దర్శించుకోవటానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వారికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, సిబ్బందితో ఈవో శీనానాయక్ పర్యవేక్షిస్తున్నారు. మరోపక్క కొండపైన విధుల్లో ఉన్న పలువురు పోలీస్ సిబ్బంది పోలీస్ అధికారుల మిగతా 6లో..

ప్రాణం మీదకు తెచ్చిన ఫ్లెక్సీ

- విద్యుదాఘాతంతో నలుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

6

పచ్చని పల్లెలు.. ఎత్తైన కొండలు. ఎటు చూసినా పరవశించేలా ప్రకృతి అందాలు.. అంతటా ఆహ్లాదకర వాతారణం. ఇలాంటి పల్లెలో ఉంటే అసలు రోగాలే దరి చేరవు ఇది నాణేనికి ఒక వైపు. మరో వైపు కాలకూట విషాన్ని తలపించేలా ఉన్న తాగునీరే వారికి దిక్కు.. ఫ్లోరోసిస్, సిలికా ఉన్నట్లు అనుమానిస్తున్న నీరు పచ్చని పల్లెలను రోగాల పాలుజేసింది. ఇంటికో కిడ్నీ రోగిని మిగిల్చింది. ఎందరో ప్రాణాలు హరిస్తోంది. అయినా ఇప్పటికీ అదే నీరు తాగాల్సిన దుస్థితిలో ఆయా పల్లెలు, గిరిజన తండాలు ఉన్నాయి. ఇదంతా ఎక్కడో ఉద్దానంలో అనుకుంటున్నారా.. కాదండి.. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో ప్రజలు జీవచ్ఛవాలుగా బతుకుతున్నారు. ఆయా గ్రామాల్లో, గిరిజన తండాల్లో ఉద్దానం తరహాలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడంతోపాటు మరణాలు సంభవిస్తున్నాయి. సంచలనంగా మారిన కిడ్నీ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలనాత్మక కథనం.

జీవచ్ఛవాలు!

ఎన్టీఆర్ జిల్లాలో మరో ఉద్దానం!

ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో కిడ్నీ వ్యాధి ఉధృతం

- నెలరోజుల వ్యవధిలో నలుగురు మృతి
- 40 ఏళ్లకే ముగిసిపోతున్న జీవితం
- అనుముల్లంకలో ఇంటికో కిడ్నీ రోగి
- అల్లాడిపోతున్న ఎ.కొండూరు తండాలు
- జీవం తీసేస్తున్న విష జలం
- ఫ్లోరోసిస్, సిలికా ఉన్నట్లు ఆరోపణ
- లేదంటూ నివేదికలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- పూర్తికాని కృష్ణాజలాల పైపులైన్ పనులు
- సురక్షిత నీరు మరింత ఆలస్యం
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో అనేక విషయాలు వెలుగులోకి..

ఆంధ్రజ్యోతి పరిశీలన


ఎ.కొండూరు డయాలసిస్ సెంటర్లో చికిత్స పొందుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

ఆంధ్రజ్యోతి-ఎ.కొండూరు/గంపలగూడెం: ఎ.కొండూరు మండలంలో వరుస కిడ్నీ మరణాలు ఆ ప్రాంత వాసులను కలవరపెడుతున్నాయి. నెలల వ్యవధిలోనే భరోత్ ధర్మ (40), బాణావతు రాముడు (65), బాణావతు కోటమ్మ (65), జరబల మంగ్య (43) అనే కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ చేయించుకుంటూ మృత్యువాత పడ్డారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 17 మంది కిడ్నీ రోగులు మరణించారని అధికారికంగా లెక్కలు వేస్తున్నా..అనధికారికంగా ఆ సంఖ్య మరింత ఉంటుందని బాధిత కుటుంబాలంటున్నాయి. ఎ.కొండూరు మండలంలో 37 ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలున్నాయి. వాటిలో 17 తండాలున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఎ.కొండూరు మండలంలో 175 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నారు. గంపలగూడెం మండలం వినగడప తండాలో 14 మంది, కొత్తపల్లిలో నలుగురు, కనుమూరులో ఎనిమిది మంది, అనుముల్లంకలో 22 మంది కిడ్నీ బాధితులు ఉన్నట్లు అధికారిక లెక్కలున్నాయి. కాని ఈ రెండు మండలాల్లో వేల సంఖ్యలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు ప్రజాసంఘాలు, బాధిత కుటుంబాలు చెబుతున్నారు. గంపలగూడెం మండలంలో మరణాలు లేకున్నా వ్యాధిగ్రస్తులు మాత్రం కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ఇంటికొకరు చొప్పున ఉన్నారు. అనుముల్లంక మాజీ సర్పంచ్ మద్దాల ప్రసాద్‌తో పాటు ఆయన భార్య మరియమ్మ ఇద్దరు కిడ్నీ వ్యాధిగ్రస్థులే.

రోజుకు 12 మందికి డయాలసిస్

ఎ.కొండూరు డయాలసిస్ సెంటర్లో రోజుకు 12 మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ చేస్తున్నారు. వీరు కాకుండా విజయవాడ వెళ్లి ప్రైవేటుగా డయాలసిస్ చేయించుకునే రోగులు ఉన్నారు. ఇక్కడ డయాలసిస్ చేయించుకునే వారు మరణిస్తేనే కిడ్నీ మరణంగా నమోదు చేస్తున్నారు. అధికారిక లెక్కల్లో చూపుతున్నారు. బయట చనిపోయిన వ్యక్తులను అధికారిక లెక్కల్లో చేర్చడం లేదు. ఈ లెక్కన కిడ్నీ మరణాలు అధికంగా ఉన్నాయనేది వాస్తవం.

రోగుల బాధలు వర్ణనాతీతం

క్రానిక్ కిడ్నీ డిసీస్ సోకిన ఇంట్లో బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. స్టేజిని బట్టి పేషెంట్స్ డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తుంది. సీరం క్రియాటిన్ 2.0 దాటితే వారిని కిడ్నీ వ్యాధిగ్రస్తులుగా పరిగణిస్తారు. ఐదు శాతం ఆ రోగికి డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. ఇలా డయాలసిస్‌కు వెళ్లే రోగి వెంట ఒక సహాయకుడు ఉండి తీరాల్సిందే. వ్యాధి తీవ్రతను బట్టి వారంలో ఒక్కొక్కరికి మూడు సార్లు, ఒక్కొక్కరికి రెండు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. వారిని డయాలసిస్ కేంద్రానికి తీసుకొచ్చేందుకు విధిగా ఒక సహాయకుడు ఉండి తీరాల్సిందే. ఈక్రమంలో ఇంటిల్లిపాది వారంలో పని మానుకొని రోగిని డయాలసిస్ కేంద్రానికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి. ఆక్రమంలో బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయే మిగతా 6లో..

'నామినేషన్ నజరానా'పై ట్రాన్స్‌కోలో అంతర్మథనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గుణదల-గంగూరు హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్లపై కండక్టర్ల మార్పిడి పనులను నామినేషన్ విధానంలో అప్పగించేందుకు రంగం సిద్ధం చేసిన ట్రాన్స్‌కో తిరిగి వెనుకడుగు వేస్తోంది. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం 'నామినేషన్ నజరానా' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో ట్రాన్స్‌కో అధికారుల్లో కలవరం మొదలైంది. గుట్టుచప్పుడు కాకుండా నామినేషన్ విధానంలో అప్పగించేందుకు జరుగుతున్న చర్యలపై కథనం రావడంతో దీనిపై ఆదివారం ట్రాన్స్‌కో అధికారుల మధ్య ఫోన్లలో చర్చ నడిచింది. ఎలా బయటకు పొక్కిందన్న దానిపై అధికారులు చర్చించుకున్నారు. ఇప్పటికే ధరల పెంపు విషయంలో వివాదాస్పదం అవ్వడం, నామినేషన్ విధానంలో అప్పగించి మరింత వివాదాస్పదం కావటం ఎందుకని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతానికి నామినేషన్ విధానాన్ని ఉపసంహరించు కోవాలని నిర్ణయించినట్టు సమాచారం.

మూతల మనోజ్ మాయ!

నకిలీ మద్యం తయారీలో పాత్ర ● ఆధారాలు సేకరించిన అధికారులు

- ఏటా లక్షల్లో మూతలు, సీసాల సరఫరా
- అధిక ధరలకు విక్రయించిన మనోజ్
- ఏటా లక్షలాది రూపాయల్లో బిల్లులు అందుకున్న వ్యాపారి



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): లక్షల్లో మూతలు సరఫరా చేశాడు. అంతకుమించి ప్లాస్టిక్ సీసాలు అందజేశాడు. నకిలీ మద్యం తయారీ కేసులో విజయవాడకు చెందిన ముత్తా మనోజ్ అలియాస్ మనోజ్‌కుమార్ జైన్ చేసిన వ్యాపారం ఇది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని ములకలచెరువులో ఏర్పాటు చేసిన నకిలీ మద్యం తయారీ కేంద్రాలకు విజయవాడ నుంచే అల్యూమినియం మూతలు, ప్లాస్టిక్ సీసాలు సరఫరా చేసినట్టు సిట్, ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన సూత్రధారులు మిగతా 6లో..

2021 నుంచి సరఫరా

అద్దేపల్లి సోదరులు 2021 నుంచి నకిలీ మద్యం తయారీని మొదలుపెట్టారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం, తంబళ్లపల్లెలోని ములకలచెరువులో నకిలీ మద్యం తయారీకి రసాయనాల మిశ్రమం జరిగినప్పటి నుంచి మనోజ్‌కుమారే మూతలు, సీసాలు సరఫరా చేశాడని తేలింది. అప్పటి నుంచి లక్షలాది రూపాయల ఆదాయాన్ని పొందినట్టు బ్యాంక్ స్టేట్‌మెంట్ల ద్వారా తెలిసింది. అద్దేపల్లి సోదరులు నకిలీ లీలలు ప్రారంభమైన తర్వాత ఎక్కువ మొత్తాన్ని ఫార్ములాను అమలు చేసిన బాలాజీ కుమార్, అతని కుమారుడు సుదర్శన్‌కు ముట్టజెప్పారు. ఇద్దరికి కలిపి రూ.2.50కోట్లకు పైగానే నజరానాలు ఇచ్చారు. ఆ తర్వాత అధిక మొత్తంలో మనోజ్‌కుమారే డబ్బులను గిట్టుబాటు చేసుకున్నాడన అధికారులు గుర్తించారు.



ఈడేపల్లిలోని సత్యసాయి మందిరంలో పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ బాలాజీ తదితరులు 6



కబడ్డీలో తలపడుతున్న కృష్ణా, శ్రీకాకుళం జిల్లాల క్రీడాకారులు 6



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సుబ్బారాయుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



మోపిదేవి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ప్రత్యేకత కావటంతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులుతీరారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వామివారికి నిర్వహించిన వివిధ సేవా రుసుముల ద్వారా ఒక్క రోజులో రూ.8,93,575లు ఆదాయం సమకూరినట్టు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపటి నుంచి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్టు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. 25వ తేదీ ఉదయం 11 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయటంతో మహోత్సవాలు ప్రారంభమవుతాయి. 26 ఉదయం 11 గంటలకు స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం, నీరాజన మంత్ర పుష్పములు, సాయంత్రం 6 గంటలకు మయూర వాహనంపై గ్రామోత్సవం, 27వ తేదీ ఉదయం 11 గంటలకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. నిత్య ఆర్జిత సేవలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు ఈవో తెలిపారు.



కేవీకే ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

నేడు కేవీకేలో 'రైతన్నా మీ కోసం' ప్రారంభం

ఘంటసాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతన్నా మీ కోసం' కార్యక్రమాన్ని సోమవారం ఉదయం ప్రారంభించనున్నట్టు కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రివర్యులు కింజరపు అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారని, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మూనాజిర్ జిలాని సామూన్, కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా దాళ్వా, మినుము పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపై చర్చాగోష్ఠి జరుగుతుందని, కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన టీడీపీ నేతలు

'రైతన్నా మీ కోసం' కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఘంటసాల విచ్చేస్తున్న నేపథ్యంలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను టీడీపీ నేతలు ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖులకు అవార్డులు అందజేసిన మండలి బుద్ధప్రసాద్

జిల్లాల విభజనపై వైసీపీ తప్పులు సరిదిద్దాలి

» మండలి బుద్ధప్రసాద్

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్విభజన, పేర్లు పెట్టడంలో గత వైసీపీ పాలకులు చేసిన తప్పులు పునరావృతం కాకుండా సరిదిద్దాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గుత్తికొండ రామరత్నం ఛారిటబుల్ ట్రస్టు, అన్నపూర్ణ వృద్ధుల సేవాశ్రమంల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చిలకలపూడిలోని వృద్ధాశ్రమంలో పలువురు ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలను మండలి బుద్ధప్రసాద్ అందజేశారు. విజయవాడకు చెందిన ప్రసిద్ధ విద్యావేత్త ఎంసీ దాస్, ఉయ్యూరుకు చెందిన సరసభారతి అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్, స్త్రీవాద కవయిత్రి మందరపు హైమావతి, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, మైలవరం విద్యావేత్త దామెర్ల నరసింహారావు, మచిలీపట్నం భావతరంగిణి వ్యవస్థాపకుడు భవిష్యలకు అవార్డులు ప్రదానం చేశారు. శతాధిక గ్రంథ కర్త డాక్టర్ జీవీ పూర్ణచంద్ అధ్యక్షత వహించిన సభలో బుద్ధప్రసాద్ మాట్లాడారు. జిల్లాల విభజన, జిల్లాలకు ప్రముఖులకు పేర్లు పెట్టడంపై ప్రజాభిప్రాయం తీసుకోవాలన్నారు. ప్రపంచ తెలుగు మహారచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు విజయాల వెనుక ఆమె భార్య గుత్తికొండ రామరత్నం ఉన్నారన్నారు. ఆమె స్మారకార్థం చాలా ఏళ్ళుగా పురస్కారాలు ఇవ్వడం ముదావహమన్నారు. జీవీ పూర్ణచంద్ మాట్లాడుతూ, రామరత్నం దాతృత్వం ధైర్యసాహసాలు అందరికీ ఆదర్శమన్నారు. కరెడ్ల సుశీల మాట్లాడుతూ, రామరత్నం పేద విద్యార్థులకు చేసిన సాయం మరువలేమన్నారు. గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ, తెలుగు భాష సుసంపన్నం చేసేందుకు తెలుగు భాషాభిమానులు, రచయితలు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో గురజాడ రాజేశ్వరి, అప్పినేడి పోతురాజు, అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

పెనమలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లా ఎరువులు, పురుగుమందులు, విత్తన రిటైల్ డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నూతన కార్యాలయంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు కొత్తపల్లి విజయకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ ఎన్నికలు మూడేళ్ల కాలానికి నిర్వహించారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కొల్లిపెర నాగపోతరాజు, గుడిమెట్ల లక్ష్మణరావు, కార్యదర్శిగా భీమవరపు శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా దివ్వెల వెంకటేశ్వరరావు, క్రాంతికిరణ్‌లు, కోశాధికారిగా అబ్బూరు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 35మంది సభ్యులతో వజ్రాల వెంకట నాగిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

నిస్వార్థసేవకు ప్రతిరూపం సత్యసాయి

» శతజయంతి వేడుకల్లో మంత్రి రవీంద్ర



కేకు కట్ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయిబాబా విద్యారంగానికి, దీనులు, దుక్కార్తులను ఆదుకునేందుకు చేసిన కృషి భారత జాతి మరచిపోదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. భగవాన్ సత్యసాయిబాబా శతవర్ష జయంతి వేడుకలు ఆదివారం మచిలీపట్నంలో ఘనంగా జరిగాయి. ఈడేపల్లిలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి మందిరంలో జరిగిన కార్యక్రమంలో సత్యసాయిబాబా చిత్రపటానికి మంత్రి రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ బాలాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సత్యసాయిబాబా బోధనలు యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయన్నారు. సత్యసాయి బోధనలు, సేవా కార్యక్రమాలను కొనసాగించడం ముదావహమన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, మచిలీపట్నంలోని సత్యసాయిబాబా మందిరంతో తనకు అవినాభావ సంబంధం ఉందన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, విద్యారంగంలో సత్యసాయి వినూత్న రీతిలో సేవలందిస్తున్నారన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ మాట్లాడుతూ, సత్యసాయిబాబా నిర్మించిన విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసంతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన అలవరచే విద్యాభ్యాసం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పోతుకూచి ఆంజనేయకుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, మాజీ కౌన్సిలర్‌లు బత్తిన దాసు, బచ్చుల అనిల్‌కుమార్, మోటమర్రి బాబాప్రసాద్, ఏఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. శతవసంతాల వేడుక సందర్భంగా మంత్రి రవీంద్ర, కొనకళ్ల నారాయణరావులు కేకు కట్ చేశారు.

జీవచ్ఛవాలు!

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ మరణ వార్త వినాల్సి వస్తుందోనని మానసికంగా కుటుంబ సభ్యులు కుంగిపోతున్నారు. ఇప్పటికే చాలా మంది కిడ్నీ వ్యాధికి ఎక్కువ సంఖ్యలో మందులు వాడిన వారు ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

దీప్లానగర్ తండాలో వెలుగులోకి..

ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం శివారు దీప్లానగర్ తండాలో 2017లో కిడ్నీ వ్యాధి పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చింది. ఒకేసారి ఇక్కడ 20 మందికి పైగా కిడ్నీ వ్యాధి బారిన పడినట్లు గుర్తించారు. దీంతో వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రోగుల కోసం ఒక ప్రత్యేక వైద్యశాల కావాలని, సురక్షిత మంచినీరు అందించాలని ఉద్యమాలు సాగాయి. మరో ఉద్దానంలా మారకముందే ప్రభుత్వం స్పందించాలని ఉద్యమాలు సాగాయి. దశాబ్ద కాలం కావస్తున్నా ఇప్పటికీ రోగుల కోసం పూర్తిస్థాయిలో వైద్య సేవలు, సురక్షిత మంచినీరు అందడం లేదు.

కనుమరుగవుతున్న తరం

కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో 40 ఏళ్ల దాటిన వారు కిడ్నీ వ్యాధి ముదరిపోయి మరుసగా మృత్యువాత పడుతున్నారు. దీంతో ఒక తరం వారు ఇక మీదట కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదని పలువురు ఆందోళన చెందుతున్నారు. 40 ఏళ్ల దాటిన వారిలో ఎంతో కొంత శాతం సీరం క్రియాటిన్ ఉండే ప్రమాదం లేకపోలేదనే వాదన ఉంది. కిడ్నీ వ్యాధిని, మరణాలను తగ్గించాలంటే విధిగా కిడ్నీ వ్యాధి నిర్ధారణ నిపుణులైన నెఫ్రాలజిస్టులతో ర్యాండమ్‌గా వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

కిడ్నీ వ్యాధికి అసలు కారణమేమిటి?

రెండు మండలాల్లో కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో నీటి శాంపుల్స్ తీసిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భూగర్భ జలంలో ఫ్లోరోసిస్, సిలికా అనే మెటల్ కాని లేవని ప్రభుత్వానికి నివేదికలిచ్చారు. ఎక్కడైతే ఫ్లోరోసిస్ అధికంగా ఉందని అధికారులు నివేదిక ఇచ్చారో అక్కడ కిడ్నీ కేసులు లేవని, ఎక్కడైతే ఫ్లోరోసిస్ లేదో అక్కడ కిడ్నీ కేసులు నమోదు అవుతున్నాయి. కిడ్నీ వ్యాధి ప్రబలేందుకు ఫ్లోరోసిస్ నీరు కారణం కాదా, ఆ నీటిలో సిలికా లాంటి విషం ఏమైనా ఉందా అనే సందేహం బాధిత కుటుంబాల నుంచి ప్రజా సంఘాల నుంచి వెలువడుతుంది. భూగర్భ జలం ఎందుకు విషతుల్యం అయ్యింది. గిరిజనులు, పల్లెల్లోని జనాన్ని ఎందుకు కిడ్నీ వ్యాధిగ్రస్తులుగా మార్చింది, మృత్యువు ఘోష ఎందుకు వినిపిస్తుందనే విషయంపై లోతైన అధ్యాయనం చేయాల్సిన పరిస్థితి ఉంది.

కృష్ణాజలాలే పరిష్కారం

ఎ.కొండూరు మండలంలోని 37 కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాలకు ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్స్‌లో శుద్ధి చేసిన కృష్ణా జలాలు సరఫరా చేయడమే శాశ్వత పరిష్కారమనే వాదన వినిపిస్తోంది. ఇందుకు జలజీవన్ మిషన్ కింద రూ.50 కోట్ల నిధులతో పైపులైన్ పనులు పూర్తి చేసి, ఆరు తండాల్లో ఓవర్ హెడ్‌ట్యాంక్‌లు పూర్తిచేసి ట్రయిల్ రన్స్ వేశారు. అయితే తాగునీరు కలుషితమై వస్తుండటంతో విషతుల్యమైన తాగునీరు తాగాల్సిన దుస్థితి నెలకొంటుందని తండా వాసులు వాపోతున్నారు. గడిచిన కొన్ని సంవత్సరాలుగా ప్రభావిత ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా కృష్ణా జలాలు సరఫరా చేస్తున్నా పూర్తిస్థాయిలో తాగునీరు అందడంలేదని ఆరోపిస్తున్నారు. పైపులైన్ పనులు కొన్నిచోట్ల నత్తనడకన సాగుతున్నాయి.

కిడ్నీ మరణాలపై అధ్యయనం

ఎ.కొండూరు మండలంలో వరుసగా జరుగుతున్న కిడ్నీ మరణాలపై అధ్యాయనం చేసేందుకు మూడు రోజుల క్రితం రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (డీపీహెచ్ఎఫ్‌డబ్ల్యూ) అడిషనల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి ఈ ప్రాంతానికి వచ్చి బాధితులు, మృతుల కుటుంబాలతో మాట్లాడి నీటి శ్యాంపిల్స్ సేకరించారు.

ఐసీఎంఆర్‌కు కలెక్టర్ వినతి

వరుస కిడ్నీ మరణాలపై స్పందించిన కలెక్టర్ జి.లక్ష్మీశ, జిల్లా వైద్యాధికారి సుహాసిని ఐసీఎంఆర్‌కు లేఖ రాసినట్లు తెలుస్తోంది. కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడానికి గల కారణాలు పూర్తిగా అధ్యయనం చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నట్టు సమాచారం.

జీవం ఉండగానే నరకం

- మాదాసు సత్యనారాయణ, కోమటికుంట



జీవించి ఉండగానే నరకం చూస్తున్నా. వయస్సు 59. భార్య రమణ (53) కిడ్నీ వ్యాధితో మృతి చెందింది. నా కుమారుడి సాయంతో డయాలసిస్ సెంటర్‌కు వస్తున్నా. ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు ఏ మూలకు సరిపోవడం లేదు. రక్తం కొనుగోలు చేసుకోవాలి. ప్యాకెట్ రూ.1,700, రెండు ప్యాకెట్లు కొనుగోలు చేసుకోవాలి. విజయవాడ నుంచి రక్తం తెచ్చుకోవాలి. వారంలో రెండు సార్లు డయాలసిస్‌కు వస్తున్నా. ఎప్పుడు పోతానో తెలియదు. పగోనికి కూడా ఈ వ్యాధి రాకూడదు.

ఏం తినలేం

-కొమ్ము సులోచన, పోలిశెట్టిపాడు



నాకు 50 ఏళ్లు. ఏం తినలేం. దాహం వేసినా నీరు తాగలేం. రోజుకు అర లీటరు నీరు మాత్రమే తాగాలి. ఏం తినాలన్నా ఆంక్షలే. జామ, బొప్పాయి, ఆపిల్ మితంగా తినాలి. ఉప్పు కారం లేకుండా చప్పిడితిండి తినాల్సిన దుస్థితి. భర్త సాయంతో డయాలసిస్ సెంటర్‌కు వస్తున్నా. పోతేనే మంచిదనిపిస్తుంటుంది.

అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం

-డాక్టర్ స్వాతి, ఎ.కొండూరు పీహెచ్‌సీ



డయాలసిస్ సెంటర్‌కు వచ్చే రోగులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇక్కడ కాకుండా విజయవాడ వెళ్లి డయాలసిస్ చేయించుకునే వారికి వాహనాన్ని ఏర్పాటు చేశాం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి కిడ్నీ వ్యాధి సోకే ప్రమాదం లేకపోలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ వారు ఇచ్చిన నివేదికల్లో కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో సిలికా అనే పదార్థం లేదని ఉంది. కిడ్నీ వ్యాధికి ఫ్లోరోసిస్ నీరే కారణం అని చెప్పలేం. ఫ్లోరోసిస్ అధికంగా ఉన్న చోట అసలు కిడ్నీ కేసులే లేవు. మరి ఎందుకిలా అనే విషయాలపై పూర్తి నిర్ధారణ రావాల్సి ఉంది.

అనధికార దర్శనాలకు బ్రేక్!

(5వ పేజీ తరువాయి)

పేరుతో కొందరిని అనధికార దర్శనాలు చేయించారు. హెడ్ కానిస్టేబుల్ గురువులు ఎటువంటి అనుమతులు లేకుండా రాజమార్గంలో పలువురిని అమ్మవారి దర్శనానికి తీసుకుని వెళుతుండగా ఈవో వారిని గమనించి ఆ హెడ్ కానిస్టేబుల్‌ను ఆపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేకుండా భక్తులను దర్శనానికి తీసుకువెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వారిని క్యూ మార్గంలో పంపించారు. ఈవో ఆలయ ప్రాంగణంలో పర్యవేక్షిస్తుండగా హెడ్ కానిస్టేబుల్ గురువులు రెండు, మూడు దఫాలుగా కొందరి భక్తులను అనుమతి లేకుండా అడ్డదారిలో వెంట తీసుకుని అమ్మవారి దర్శనానికి వెళ్లాడు. ఈవో హెచ్చరించినప్పటికీ అతనిలో మార్పు రాకపోవడంతో గురువులను ఈ.వో పిలిచి మరోసారి భక్తులను అడ్డదారిలో తీసుకువెళ్లి దర్శనాలు చేయిస్తే కొండపై నుంచి పంపించివేసి, పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మరో కానిస్టేబుల్ అల్లు జగదీష్ ఆలయ అధికారుల అనుమతి లేకుండా దేవస్థానం పీఆర్‌వో విభాగానికి కారును కొండ దిగువ నుంచి కొండపైకి అనుమతించాలంటూ ఫోన్ ద్వారా మెసేజ్ పంపించాడు. ఈ మెసేజ్‌ను గమనించిన ఈవో అల్లు జగదీష్ ఎవరంటూ ఆరా తీయగా కానిస్టేబుల్ అని తెలియటంతో కానిస్టేబుల్ జగదీష్‌ను పిలిచి మందలించారు. మరోసారి ఇటువంటి పనులు చేస్తే పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

పోలీస్ అధికారుల పేరుతో మెసేజ్‌లు

కొండపైకి కారులు అనుమతించాలంటూ అత్యధికంగా పోలీస్ విభాగానికి చెందిన అధికారుల పేరుతో దుర్గగుడి పీఆర్‌వో విభాగానికి మెసేజ్‌లు రావటం ఆలయంలో చర్చనీయాంశమైంది. ఉదయం నుంచి కొందరు పోలీస్ ఉన్నతాధికారుల పేరుతో దుర్గగుడి పీఆర్‌వో విభాగానికి వాహనాలను కొండపైకి అనుమతించాలంటూ మెసేజ్‌లు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఈవో వాస్తవంగా పోలీస్ ఉన్నతాధికారులు పంపించిన మెసేజ్‌లా లేక దుర్గగుడిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఆ మెసేజ్‌లు పంపించారా? అంటూ ఆరా తీశారు. ఎవరైనా వీఐపీలు, పోలీస్ ఉన్నతాధికారులు, ఇతర విభాగం ఉన్నతాధికారులు కొండపైకి వచ్చే ముందు పీఆర్‌వో విభాగంలో అమ్మవారి దర్శనానికి వచ్చే వారి పేర్లు, ఎంతమంది వచ్చేది, వారి ఫోన్ నెంబర్, రిఫరెన్స్ చేస్తున్న వారి పేరు తప్పనిసరిగా మెసేజ్ పంపించాలంటూ ఈవో సంబంధిత పీఆర్‌వో విభాగం అధికారులను ఆదేశించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఎంత మంది వీఐపీలు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు అమ్మవారి దర్శనానికి వచ్చారు? షిఫ్టుల్లో విధుల్లో ఉన్న ఉద్యోగులు ఈవో కార్యాలయానికి తెలియపరచాలని శీనానాయక్ తెలిపారు.

ఇంక్రిమెంట్ల మాయాజాలం!

(5వ పేజీ తరువాయి)

నచ్చచెప్పి నగదు చెల్లింపులు చేసేలా వ్యవహారం చక్కదిద్దుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..

ఐవీఆర్ఎస్ సర్వేలో వెనకబడితే ఇక అంతే..

ప్రభుత్వం ఇటీవల పంచాయతీల్లో తడిచెత్త, పొడి చెత్తం వేర్వేరుగా సేకరిస్తున్నారా, పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా చేస్తున్నారా లేదా అనే అంశంపై నేరుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫోన్ చేసి వివరాలు సేకరిస్తోంది. ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజలు ఇచ్చిన సమాధానాలు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి నివేదికల రూపంలో వస్తున్నాయి. ఏదైనా పంచాయతీలో పారిశుధ్య చర్యలు చేపట్టడంలో వెనుకబడి ఉన్నట్లుగా నివేదికలో ఉంటే అక్కడకు అధికారులు వాలిపోతున్నారు. ప్రభుత్వం పంపిన ఐవీఆర్ఎస్ సర్వేలో మీ పనితీరు బాగుండలేంటూ నివేదిక వచ్చింది. మీపై చర్యలు తప్పవని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇదే అదనుగా విజయవాడ నుంచి ప్రత్యేకంగా డెప్యుటేషన్‌పై డీపీవో కార్యాలయానికి వచ్చిన ఓ జూనియర్ అసిస్టెంట్ అధికారులు మీ పనితీరుపట్ల ఆగ్రహంగా ఉన్నారని, వారితో నేను మాట్లాడి నచ్చచెబుతానని చెప్పి తెరవెనుక బేరాలు పెడుతున్నాడని సమాచారం. అంతటితో ఆగకుండా అధికారులు మీ మండలంలో పలానారోజున పర్యటనకు వస్తున్నారని, ఇబ్బందులు లేకుండా నేను చూసుకుంటానని, ఇందుకు గాను నగదు సమకూర్చాలని ముందస్తుగానే చెబుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు చెప్పుకోవడం గమనార్హం. గత నెల రోజుల వ్యవధిలో రెండు మండలాల్లోని పంచాయతీ కార్యదర్శుల నుంచి పెద్దమొత్తంలో ఈ జూనియర్ అసిస్టెంట్ నగదు వసూలు చేశాడని తెలిసింది.

మూతల మనోజ్ మాయ!

(5వ పేజీ తరువాయి)

అద్దేపల్లి జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావుతో ఎలాంటి సంబంధం లేదని ముతా మనోజ్ కుమార్ బుకాయిస్తూ వచ్చాడు. దీనికి సంబంధించిన ఆధారాలను అధికారులు సేకరించారు. ఆ ఆధారాలను సాంకేతికంగా సంపాదించడంతో మనోజ్‌కుమార్ ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

రూ.లక్షల్లో ఆదాయం

మనోజ్‌కుమార్ విజయవాడ వన్‌టౌన్‌లోని పులిపాటి వారి వీధిలో చిన్న షాపులో ప్లాస్టిక్ సీసాలు, అల్యూమినియం మూతల వ్యాపారం చేస్తున్నాడు. అక్రమంగా వ్యాపారాలు చేసే వారికి సరుకును సరఫరా చేయడం మనోజ్‌కుమార్‌కు వెన్నతోపెట్టిన విద్య. ఎక్సైజ్ పోలీసులు మనోజ్ పేరును కోర్టుకు తెలియజేసిన తర్వాత అతడి అసలు స్వరూపం బయటకు వచ్చింది. విచారణకు హాజరుకావాలని పోలీసులు పలుమార్లు సమాచారం ఇచ్చినప్పటికీ లెక్క లేనట్టుగా వ్యవహరించాడు. ఇప్పుడు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టు మెట్లు ఎక్కాడు. ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకోగానే గుండెపోటు వచ్చిందని నేలపై కూర్చిండిపోయాడు. పోలీసులు అతడిని ఆసుపత్రిలో చేర్పించి 41ఏ నోటీసు ఇచ్చి పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలని స్పష్టం చేశారు. ఇది జరిగిన వెంటనే మనోజ్‌కుమార్ హైకోర్టు తలుపులు తటాడు. దీంతో ఎక్సైజ్ పోలీసులు, సిట్ అధికారులు మనోజ్‌కుమార్ జోలికి వెళ్లడం లేదు. హైకోర్టు ఆదేశాలు వచ్చిన తర్వాత ఆచితూచి అడుగులు వేయాలని అధికారులు భావిస్తున్నారు.

పొట్టిపాడు టోల్‌ప్లాజ్ తొలగించేనా?

(5వ పేజీ తరువాయి)

పొట్టిపాడు టోల్‌ప్లాజాను తొలగిస్తున్నారు. దీంతో కలపర్రు టోల్‌ప్లాజా నుంచి వెదురుపావులూరు టోల్‌ప్లాజా వరకు 40 కిలోమీటర్ల దూరం ఉంటోంది. రెండు టోల్‌ప్లాజాల మధ్య 60 కిలోమీటర్ల దూరం ఉండాల్సి ఉండగా, పొట్టిపాడు టోల్‌ప్లాజాను తొలగించినా కూడా 40 కిలోమీటర్ల దూరమే వస్తోంది. ఇక వెదురుపావులూరు టోల్‌ప్లాజా, వెంకటపాలెం టోల్‌ప్లాజాల మధ్య 27 కిలోమీటర్ల దూరమే ఉంది. ఈ రెండు టోల్‌ప్లాజాల మధ్య కూడా 60 కిలోమీటర్ల దూరం లేదు. వెంకటపాలెం నుంచి కాజా టోల్‌ప్లాజా వరకు కూడా 27 కిలోమీటర్ల దూరమే ఉంది. ఇలాంటప్పుడు ఇంత దగ్గరగా టోల్‌ప్లాజా ఎందుకో అర్థంకాని పరిస్థితి. ప్యాకేజీకి ఒక టోల్‌గేట్ చొప్పున అనుమతులు ఇవ్వటం ద్వారా వాటి మధ్య నిర్ణీత దూరం తగ్గిపోతోంది. ఎన్‌హెచ్-16పై ఈ పరిస్థితి ఉంటే, ఎన్‌హెచ్-65పై కీసర టోల్‌ప్లాజా నుంచి చిల్లకల్లు టోల్‌ప్లాజా వరకు 31 కిలోమీటర్ల దూరమే ఉంది. ఎన్‌హెచ్-65పై ఉన్న కీసర టోల్‌ప్లాజా నుంచి ఎన్‌హెచ్-16పై బైపాస్‌లో ఉన్న వెదురుపావులూరు టోల్‌ప్లాజా వరకు 55 కిలోమీటర్ల దూరం ఉంది.



పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల బాలికల మధ్య పోటీ

హోరాహోరీగా
రాష్ట్ర కబడ్డీ పోటీలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నోబుల్ కళాశాల క్రీడాప్రాంగణంలో రెండోరోజు ఆదివారం కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్ 14 బాలురు, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల మధ్య బాలుర పోటీలో తూర్పుగోదావరి జిల్లా 39 పాయింట్లతో విజయం సాధించింది. వైఎస్ఆర్ కడప, ప్రకాశం జట్ల మధ్య పోటీల్లో ప్రకాశం జట్టు 41 పాయింట్లతో గెలుపొందింది. కర్నూలు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు జట్టు 61 పాయింట్లతో గెలుపొందింది. నెల్లూరు, అనంతపురం జట్ల మధ్య గట్టి పోటీ జరిగింది. నెల్లూరు జట్టుకు 33 పాయింట్లు రాగా, అనంతపురం జట్టుకు 32 వచ్చాయి. నెల్లూరు జట్టు విజయం సాధించింది. చిత్తూరు, కృష్ణా జట్ల మధ్య జరిగిన పోటీల్లో చిత్తూరుకు 22, కృష్ణాకు 37పాయింట్లు వచ్చాయి. 15 పాయింట్ల ఆధిక్యతతో కృష్ణా జట్టు గెలుపొందింది. ప్రకాశం, విశాఖపట్నం జట్ల మధ్య పోటీల్లో ప్రకాశం జట్టు 35 పాయింట్లతో గెలుపొందింది. కడప, తూర్పుగోదావరి జట్ల మధ్య పోటీల్లో కడప జట్టు 34 పాయింట్లతో గెలుపొందింది. నెల్లూరు, విశాఖపట్నం జట్ల మధ్య పోటీల్లో నెల్లూరు 46 పాయింట్లతో గెలుపొందింది. శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల మధ్య పోటీల్లో శ్రీకాకుళం జట్టు 45 పాయింట్ల ఆధిక్యతతో గెలుపొందింది. ప్రకాశం, తూర్పుగోదావరి జట్ల మధ్య పోటీల్లో ప్రకాశం 37 పాయింట్ల ఆధిక్యతతో గెలుపొందింది. గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య పోటీల్లో గుంటూరుకు 48 పాయింట్ల ఆధిక్యతతో గెలుపొందింది.



విజయనగరం, చిత్తూరు జిల్లాల జట్ల మధ్య పోటీ

బాలికల జట్ల విజేతలు వీరే..

పశ్చిమగోదావరి జట్టు 52 పాయింట్లతో గుంటూరుజట్టుపై, చిత్తూరు జట్టు 29 పాయింట్లతో కడపపై, విజయనగరం జట్టు 29 పాయింట్లతో విశాఖపట్నంపైనా, కృష్ణా జట్టు 35 పాయింట్లతో పశ్చిమగోదావరిపైనా, ప్రకాశం జట్టు 28 పాయింట్లతో నెల్లూరు జట్టుపైన, తూర్పుగోదావరి జట్టు 45 పాయింట్లతో కర్నూలుపైన, చిత్తూరుజట్టు 21 పాయింట్లతో విశాఖపై, విజయనగరం జట్టు 32 పాయింట్లతో కడప జట్టుపై, కృష్ణాజట్టు 45 పాయింట్లతో గుంటూరు జట్టుపై, అనంతపురం జట్టు 31 పాయింట్లతో నెల్లూరుపైన గెలుపొందాయి. లీగ్ పద్ధతిలో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను మంత్రి రవీంద్ర, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హనీంబేగ్ అభినందించారు.



కిడ్నాప్ కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్టు పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం గూడూరు స్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 17న సాయంత్రం 6.30 గంటలకు గూడూరు మండలం తరకటూరు గ్రామానికి చెందిన వ్యక్తి మచిలీపట్నంలో ఇంటర్ చదువుతున్న తన మైనర్ కుమార్తెను రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద తరకటూరు గ్రామానికి చెందిన దారపురెడ్డి నవీన్, స్నేహితులతో కలసి బలవంతంగా తీసుకువెళ్లిపోయాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బందరు డీఎస్పీ రాజా పర్యవేక్షణలో గూడూరు ఎస్ఐ రెండు టీమ్‌లుగా ఏర్పడి బాలికలను గుడివాడలో గుర్తించారన్నారు. ఆమె ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం పోక్సో, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. బందరు డీఎస్పీ రాజా దర్యాప్తులో భాగంగా శనివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో దారపురెడ్డి నవీన్, అతడికి సహకరించిన గంటా తరుణ్, తిరుమలశెట్టి కృష్ణవంశీ, కోళ్ల కార్తీక్‌సాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్టు తెలిపారు.



విద్యుత్‌వైర్లకు తగిలి వేలాడుతున్న ఫ్లెక్సీ ఫ్రేమ్, తీవ్రంగా గాయపడిన గౌరి పర్తి సురేంద్ర(కింద)

ప్రాణంమీదకు తెచ్చిన ఫ్లెక్సీ

» విద్యుదాఘాతంతో నలుగురికి గాయాలు

» ఒకరి పరిస్థితి విషమం



ఉయ్యూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప దీక్షపరులు పడిపూజ సందర్భంగా రోడ్డుపక్కన కట్టిన ఫ్లెక్సీ నలుగురి ప్రాణాలమీదకు తెచ్చింది. భవనం పక్కన కట్టిన ఫ్లెక్సీ తీస్తుండగా విద్యుత్ వైర్లకు తాకి నలుగురు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం సాయంత్రం శివాలయం సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. స్థానిక సుందరమ్మ పేటకు చెందిన యువకులు శివాలయం ఎదురుగా మేదర బజార్ వైపు కట్టిన ఫ్లెక్సీ తీసేందుకు పక్కన ఉన్న భవనంపైకి గౌరిపర్తి సురేంద్ర, మేకల శివసాయి, జొన్నలగడ్డ పృథ్వీనాథ్, జొన్నలగడ్డ రాము ఎక్కారు. ఫ్లెక్సీ తీస్తున్న క్రమంలో జారి పక్కన ఉన్న విద్యుత్ వైర్లకు ఫ్లెక్సీ ఫ్రేమ్ తాకింది. దీంతో యువకులు విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. యువకులు తీవ్రంగా గాయపడగా ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు. ప్రమాదంలో సురేంద్ర పరిస్థితి విషమంగా ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

దుర్గగుడిలో అన్నప్రసాద పథకానికి విరాళం



ఇంద్రకీలాద్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో అన్న ప్రసాద పథకానికి ఆదివారం విజయవాడ పటమటకు చెందిన కోగంటి వెంకట రామయ్య కుటుంబ సభ్యులు కోగంటి వెంకట కృష్ణారావు, ప్రజ్ఞ పేరిట రూ.1,01,116లు విరాళంగా ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందజేశారు.ఈ సంద ర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి దర్శనం కల్పించారు. వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి చిత్రపటం విరాళం రశీదు, లడ్డూప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



బహుమతి అందుకుంటున్న రిత్విక్, యశ్వంత్, దినేష్

స్రవంతి విద్యార్థుల ప్రతిభ

గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చెకుముఖి సైన్స్ జిల్లాస్థాయి పోటీల్లో స్రవంతి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ తెలిపారు. మచిలీపట్నంలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముఖి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న చిక్కవరపు రిత్విక్, వై.యశ్వంత్ పవన్, బి.దినేష్‌లు చక్కటి ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు. అలాగే బి.తన్మయ, వి.వాసంతి, ఆర్ శ్రావణిలు తృతీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో బహుమతులు సాధించటం అభినందనీయమన్నారు.



ఆహ్వానపత్రికలు అందజేస్తున్న ధర్మప్రచారక్ యడవల్లి

సనాతన ధర్మ విశిష్టతను యువతకు తెలియజేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సనాతనధర్మ విశిష్టతను అందులో దాగి ఉన్న శాస్త్ర విజ్ఞానాన్ని యువతకు తెలియజేయాలని ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు అన్నారు. రంగయ్యప్పారావు పేట, కానుమోలు గ్రామాల్లో ఆదివారం ధర్మప్రచారం నిర్వహించి శివశక్తి దశవార్షిక శంఖారావం ఆహ్వాన పత్రికలను అందజేశారు. విజయవాడలో నిర్వహించే శివశక్తి దశవర్ష శంఖారావాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివశక్తి సభ్యులు తట్టి సుబ్బారావు, శేఖర్, జ్యోతి, సుశీల, తదితరులతో పాటు భక్తి, భజన బృంద సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్న సమారాధన



ఉయ్యూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గండిగుంట అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాల దారులకు అన్నసమారాధన (బిక్ష) ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు, దాతల సహకారంతో 45 రోజుల పాటు అయ్యప్ప మాలదారులకు ప్రతిరోజూ అన్న సమారాధన చేయనున్నట్టు తెలిపారు. మాలధరించిన భక్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు తెలిపారు.

సీఐటీయూ నిరసన

గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని సీఐటీయూ మండల కార్యదర్శి బెజవాడ తాతబ్బాయి అన్నారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఆదివారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో సీఐటీయూ నాయకులు జీవోలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమల్లోకి వచ్చిన నాటి నుంచి కార్మికుల సంక్షే మానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని మండిపడ్డారు. ముఠా, పంచాయతీ కార్మికులు, బిల్డింగ్, హాకర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నూకల సాంబశివరావు

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి

ఉయ్యూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిర్మాణాత్మక శిక్షణ, కార్యకలాపాల ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణం, దేశభక్తి పెంపొందించేందుకు ఎన్‌సీసీ ఎంతగానో దోహదపడుతుందని సుధీర్ టింబర్ డిపో అధినేత, ఆర్యవైశ్య సంఘ ప్రముఖుడు డాక్టర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. ఎన్‌సీసీ స్థాపన దినోత్సవం పురస్కరించుకుని ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు 50 దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, డైరెక్టర్ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ పి.శ్రీరామ్ పాల్గొని ఎన్‌సీసీ ప్రత్యేకత వివరించారు.

చేనేత వస్త్రాలతో మన సంస్కృతీ సంప్రదాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మన రాష్ట్రానికి చెందిన చేనేత వస్త్రాలు తెలుగు వారి జీవన విధానంతో ముడిపడి మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి అన్నారు. హనుమాన్ జంక్షన్‌లోని శ్రీసాయికళ్యాణి క్రియేటర్స్ ఆధ్వర్యంలో వసుంధర డైమండ్ రూఫ్ సహకారంతో చేనేత వస్త్ర, నగల ప్రదర్శన, అమ్మకాలను ఆదివారం ప్రారంభించారు. రాష్ట్ర చేనేత పరిశ్రమను ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు చేనేత వస్త్రాలు, నగలను చేరువచేసేందుకు ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, వసుంధర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసాదంపాడు పంచాయతీ

- అస్తవ్యస్తంగా రోడ్లు
- పూడిపోయిన డ్రెయినేజీలు రోడ్డుపైకి వస్తున్న మురుగు నీరు
- పగిలిపోయిన డ్రెయిన్ పై కప్పులు
- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త
- ముఖం చాటేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు





ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త.. కదలని మురుగు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

నగరానికి ద్వారమైన, ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రసాదంపాడు గ్రామ పంచాయతీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ పల్లెల్లో కంటే అధ్వానంగా, అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రసాదంపాడు పంచాయతీ ఎన్‌హెచ్-16ను ఆనుకుని ఉన్నప్పటికీ కనీస సదుపాయాలకు నోచుకోలేదు. ప్రభుత్వాలు, నాయకులు మారుతున్నారు కానీ ఇక్కడ అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఎక్సైజ్ కార్యాలయం రోడ్డు అయితే మరింత అధ్వానంగా ఉంది. ఏడేళ్ల కిందట వేసిన మట్టి రోడ్డే మహా ప్రసాదంగా ఉందని స్థానికులు చలోక్తులు విసురుతున్నారు. ఈ పంచాయతీలో గతంలో సిమెంట్ రోడ్లు వేసినప్పటికీ ప్రస్తుతం అవి గుంతలమయంగా మారాయి. అప్పట్లో వేసిన డ్రెయిన్లు పూడుకుపోయి రోడ్లపైకే కాలువ నీరు చేరి కాలనీలు దుర్గంధంగా మారుతున్నాయి. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

అభివృద్ధికి నోచుకోని రోడ్లు

ప్రసాదంపాడు పంచాయతీ ఏర్పడి సుమారు 25 సంవత్సరాలు అవుతోంది. సుమారు 50 వేల మందిపైనే జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ 20 కాలనీల కంటే ఎక్కువ ఉన్నాయి. 15 ఏళ్ల కిందట రోడ్లు, కాలువలు నిర్మించారు. నాటి నుంచి ఈ కాలనీ వైపు చూసిన నాయకుడే లేడు. ఆ రోడ్లన్నీ ప్రస్తుతం గోతులతో నిండిపోయాయి. రోడ్లు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వర్షాకాలంలో బురద, మిగతా సీజన్‌లో దుమ్ముధూళి

పంచాయతీ పరిధిలోని గతంలో ఎక్సైజ్ కార్యాలయం ఉండేది. ప్రస్తుతం ఈ కార్యా లయాన్ని మంగళగిరికి తరలించారు. అయితే ఈ రోడ్డు ఇప్పటికీ మట్టిరోడ్డుగానే ఉండడం గమనార్హం. వర్షాకాలం వస్తే ఈ రోడ్డు ప్రయాణించాలంటే నరకమే. గతంలో వేసిన మట్టిరోడ్డు కావడంతో గోతులతో నిండిపోయింది. ప్రస్తుతం వర్షం పడితే ఈ రోడ్డులో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. శీతాకాలం, వేసవి కాలంలో ఈ రోడ్డు పక్కనుండే ఇళ్లలోకి దుమ్ము, ధూళి చేరి వస్తువులన్నీ పాడైపోతున్నాయని, గోడలు ధూళితో నిండిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శివారు రోడ్లను పట్టించుకోవడంలేదు



పంచాయతీ శివారు రోడ్లను అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. ప్రసాదంపాడు ఎక్సైజ్ ఆఫీస్‌వైపు రోడ్డే ఉండేది కాదు. సర్పంచ్ చొరవ చూపి ఏడేళ్ల కిందట మట్టిరోడ్డు వేయించారు. అప్పటి నుంచి ఇదే రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నాం. ఈ రోడ్డు వర్షాకాలంలో బురద, వేసవి కాలంలో దూళితో నిండిపోయి ఉంటుంది.

- ప్రసాద్, స్థానికుడు

సమస్యలు పరిష్కరించేవారు లేరు



అధికారులు, రాజకీయ నాయకులు సమస్యలను పట్టించు కోవడం లేదు. నాకు యూట్యూబ్ చానల్ ఉంది. అందులో ఎన్నోసార్లు స్థానిక సమస్యలను అప్‌లోడ్ చేశా. అయినా ఎటువంటి స్పందన లేదు. కాలనీ మొత్తం డ్రైనేజీ వ్యవస్థ పూడుకు పోయి రోడ్లపైకి మురుగునీరు వచ్చి దుర్వాసన వస్తోంది.దోమలు పెరిగి ఇబ్బంది పడుతున్నాం.

- బాబి, స్థానికుడు



అధ్వానంగా రోడ్లు



కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలి: సీపీఎం

గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. మర్లపాలెంలో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచదేశాల్లో యుద్ధానికి అమెరికాయే కారణమన్నారు. అమెరికా ప్రపంచంపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. ప్రపంచంలో ఇప్పటి వరకు జరిగిన 104 యుద్ధాలు అమెరికా ఆర్మీ మరణాయుధాల వ్యాపార లాభాల కోసమేనన్నారు. సీపీఎం నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, విరప నాగేశ్వరరావు, పఠాన్ సర్దార్, బాబావలీ, జాస్తి శ్రీనివాసరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా తాడిగడప మునిసిపాలిటీ అభివృద్ధి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకిలో సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని తాడిగడప మునిసిపాలిటీని కోట్ల నిధుల వ్యయంతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం పోరంకి బీజేఆర్ నగర్‌లోని చైతన్య కళాశాల ప్రధాన రోడ్డు, అడ్డ రోడ్లను కలిపి 48.4 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్లు, విశ్వసాయి అపార్టుమెంటు నుంచి సాయిమంజునాథ టవర్స్ వరకు 29.7లక్షల నిధులతో సీసీ రోడ్డు, పోరంకి నిడమానూరు రోడ్డు కృష్ణాపురం కాలనీలో 1.6కోట్ల సీఆర్డీయే నిధులతో ప్రధాన సీసీ రోడ్లు, అంతర్గత రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. గడచిన వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి ఊసే లేకుండా సాధారణ ప్రజలు ఇళ్లముందు నీరు నిలిచి నడిచేందుకు వీలు లేకుండా పోయిందని, పెనమలూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి రోడ్డు, ప్రతి వీధిలో ఇంటింటికి తిరగడం వల్ల ప్రజల ఇబ్బందులు తెలుసుకోగలిగానని తెలిపారు. ఎక్కడెక్కడ రోడ్లు డ్రెయిన్లు కల్వర్టులు కావాలో స్పష్టమయిన అభిప్రాయం ఉందని తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల నాయకత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు.



జంక్షన్‌లో సామూహిక సత్యసాయి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా సత్యసాయి శత జయంతి

పెనమలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి శత జయంతి ఉత్సవాలు పెనమలూరులో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి నామ సంకీర్తన పారాయణం, నారాయణ సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం బాలవికాస్ చిన్నారులచే ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం సాయిబాబా పల్లకి సేవను పెనమలూరు గ్రామ వీధుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ మోహనరావు, జిల్లా ఆధ్యాత్మిక సామాన్య కర్త లక్ష్మీప్రసూన, ఉయ్యూరు రమణమ్మ, ఝాన్సీ, వుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: విశ్వశాంతి, సౌభాగ్యం, సకల జనుల సంతోషం కోసం పరితపించిన భగవాన్ సత్యసా యిబాబా సిద్ధాంతాలు స్ఫూరిగా తీసుకుని సేవా కార్యక్రమాలకు ప్రేరణ పొందుదామని ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం బాబా చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. సకల జనుల సంతోషం కోసం సాయిబాబా చేసిన సేవా కార్యక్ర మాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మానవ విలువలు బాబా బోధించారన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సత్యసాయిబాబా శతవర్ష జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్ ఇందిరానగర్‌లోని సత్య సాయి బాబా మందిరంలో తెల్లవారుఝామున సుప్రభాతసేవతో మొదలైన వేడుకల్లో పాదుకాపూజ నిర్వహించి కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు శ్రీసత్య సాయి పతాక ఆవిష్కరణ చేశారు. యనమదల రామదాసు, కస్తూరి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె కట్ చేశారు. తదనంతరం సామూహిక శ్రీసత్యసాయి సత్యనారాయణ వ్రతాల్లో అధిక సంఖ్యలో పుణ్యదంపతులు పాల్గొన్నారు. హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయ స్వామి దేవస్థాన చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, సుంకర సుభాస్ చంద్రబోస్, వేగిరెడ్డి పాపారావు, చల్లగుళ్ల జ్ఞానసాయి సత్యనారాయణ, యనమదల అనంతరామ్ తదితరులు బాబా వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

శరవేగంగా అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాపులపాడులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. స్వామి వారి సన్నిధానానికి గుమ్మాలు నిలబెట్టే కార్యక్రమాన్ని అయ్యప్పదీక్షాదారుల మధ్య ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ గూడపాటి రత్నశేఖర్, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్, కొండేటి భాస్కర్, తదితర కమిటీ సభ్యులు, అయ్యప్ప దీక్షాదారులు పాల్గొన్నారు.



జంపాన రాఘవయ్య వర్ధంతిలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి జంపాన కృషి

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

కంకిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన కల్లుగీత కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు జంపాన రాఘవయ్య కృషి మరువలేనిదని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ఉప్పలూరులో ఆదివారం నిర్వహించిన రాఘవయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొండవీటి శివయ్య, సొసైటీ అధ్యక్షులు పడవల మధుసూ దనరావు, టీడీపీ నాయకులు రాధాకృష్ణ, వీరాస్వామి కంచర్ల వెంకటేశ్వరరావు, బొర్రా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న టీడీపీ నాయకులు

కంకిపాడులో ఇంటింటికీ టీడీపీ

కంకిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా తెలుగుదేశం పార్టీ క్యాడర్ పని చేస్తుందని స్థానిక టీడీపీ నాయకులు చిట్టూరి నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశాల మేరకు ఆదివారం ఇంటింటికి తిరుగుతూ, ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు చేరవేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కొండా నాగేశ్వరరావు, అన్నే రామారావు, బాజీ, కాకుమాను రమేష్, వీరంకి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



టిఫిన్ బండ్లను అందిస్తున్న బోడె వెంకట్రామ్

పేదలకు టిఫిన్ బండ్ల వితరణ

పెనమలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు వాటపల్లి నాంచారమ్మ, మరీదు వెంకటేశ్వరరావులకు టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ టిఫిన్ బళ్లను అందించారు. పార్టీ పోరంకి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం పెనమలూరు, పోరంకి గ్రామాలకు చెందిన నాయకుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోయ ఆనంద్‌ప్రసాద్, తోటకూర ఉద యభాస్కర్, చిగురుపాటి శ్రీనివాస్, లక్ష్మణ్, వీర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కొండాలమ్మకు పొంగళ్లు

గుడ్లవల్లేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొన్నారు. కార్తీక మాసం ముగిసిన తొలి ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొన్నారు. పాల పొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోహన్ పర్యవేక్షించారు.



కొండాలమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

కూచిపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకలను పురస్కరించుకుని మొవ్వ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవాసమితి కన్వీనర్ మండవ వాసుదేవరావు దంపతుల ఆధ్వర్యంలో నగర సంకీర్తన, ఓంకారం, సుప్రభాత సేవ, అభిషేకాలు, పతాకావిష్కరణ, ఉంజల్ సేవ, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బండారు వాసుదేవరావు, వెంకటేశ్వరరావు దంపతులు పూజలు చేశారు. లక్ష్మీనారాయణ, శివ, పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల విభాగంలో భగవాన్ సత్యసాయి బాబా శతవార్షిక జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు.కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, ఎన్ఎస్ఎస్ పి.వో సతీష్ చంద్ర, కో-ఆర్డినేటర్ జీవన్, గ్రంథాలయ అధికారి ఎన్. శరత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మోటారు సైకిళ్ల చోరీ

- ప్రభుత్వాసుపత్రి, రైతుబజారు వద్దే చోరీలు
- స్టాండ్ పక్కనే పోలీస్ అవుట్‌పోస్టు
- కొరవడిన పోలీస్ పర్యవేక్షణ

పట్టణంలో బైక్ దొంగతనాలు నిత్యకృత్యమయ్యాయి. ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రాంతాలైన ఏరియా ప్రభుత్వాసుపత్రి, రైతుబజారుల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీస్‌శాఖ పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

(గుడివాడ - ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో పట్టణంలో బైక్ దొంగతనాలు విపరీతంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలోని స్టాండ్‌లో పెట్టిన ద్విచక్రవాహనాలే చోరీకి గురవుతున్నాయి. ఆసుపత్రిలో ముందర బ్లాక్ పక్కన నుంచి చిన్న సందుగా వెనుక గేటు వద్ద వరకు నేరుగా మార్గముంది. ఎయిడ్స్ రోగులు కోసమే ఈ గేటును తెరచి ఉంచుతారు. ఈ మార్గంలో ఎటువంటి సీసీ కెమెరాలు లేవు. ఈ మార్గం ద్వారానే ద్విచక్రవాహనాలను తరలించి ఉంటారని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడివాడ జోన్స్ పేర్కొన్నారు. 24 గంటలు ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద,స్టాండ్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. స్టాండ్ పక్కనే పోలీసు అవుట్‌పోస్టు , సెక్యూరిటీ ఉన్నప్పటీ దొంగతనాలు జరుగుతుండటం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

> **టోకెన్ సిస్టమ్ ఏర్పాటుకు సిఫారసు**
>
> దొంగతనాలు జరుగకుండా ఆసుపత్రిలోనికి వచ్చే ద్విచక్రవాహనాలకు టోకెన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో చర్చిస్తున్నాం. ఆసుపత్రిలో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుచేయాలని అభివృద్ధి కమిటీకి సూచించాం.
>
> **కొండపల్లి శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ**

పట్టణంలో అధికంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో రైతుబజారు ఒకటి. రైతుబజారులోకి వెళ్లే వారు అధికంగా స్టేడియం వైపునకు ఉన్న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వెనుక, కెనరా బ్యాంకు వద్ద ద్విచక్రవాహనాలను పార్కు చేస్తారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వెనుక స్టేడియం రహదారి వెంబడి ఎటువంటి సీసీ కెమెరాలు లేకపోవడంతో ద్విచక్రవాహనాలు దొంగతనానికి గురవుతున్నాయి.



సీసీ కెమెరాలు లేని ఆసుపత్రి వెనుక ఉన్న దారి



రైతు బజారు వద్ద ద్విచక్రవాహనాల స్టాండ్

పోలీసుల నిర్లక్ష్యమే..

. ఏరియా ప్రభుత్వాసుపత్రి, రైతుబజారుల వద్ద చోరీలు జరిగినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వాహనాల చోరీలను నిలువరించడంలో పోలీసులు వైఫల్యం చెందారు. ఇక్కడ ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. రెండు ప్రాంతాల్లో ఒక కానిస్టేబుల్‌ను గానీ, మఫ్టీలో సిబ్బందిని గానీ ఏర్పాటు చేయలేదు. పోలీసులు నిర్లక్ష్యం కారణంగానే చోరీలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



గణిత ఉపాధ్యాయుడు యాకుబ్‌పాషాను సత్కరిస్తున్న మంత్రి పార్థసారథి

గణిత ఉపాధ్యాయుడికి సత్కారం

గుడివాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీటీడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ, తాడిగడపలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ సన్మాన మహోత్సవంలో స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సయ్యద్ యాకుబ్ పాషాను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి వివిధ ప్రైవేటు ఉపాధ్యాయులు, సిబ్బంది, సన్మానగ్రహీత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తాం

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు వేగవంతరంగా సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకొంటున్నామని, రైతులు అపోహలకు పోవద్దు ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆదివారం గుడ్లవల్లేరు , వడ్లమన్నాడు, వేమవరం, కౌతవరం తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే రాము పర్యటించారు. కోతలు కోయని వరిచేలను, కోతపూర్తయ్యి రోడ్లవెంబడి ఆరబోసిన ధాన్యాలను ఎమ్మెల్యే రాము పరిశీలించారు. పలువురు రైతులతో రాము మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రాల్లో నిర్ణయించిన తేమ శాతానికి, రైస్‌మిల్లర్ల వద్ద తేమశాతానికి వ్యత్యాసం వస్తోందని పలువురు రైతులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. వెంటనే ఎమ్మెల్యే వెనిగండ్ల జేసితో ఫోన్లో మాట్లాడి రైతుల ఆరోపణలను వివరించారు. మిల్లర్ల వద్ద రైతులకు ఇబ్బందులు ఎదుకాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జేసికి సూచించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ రైతులకు న్యాయమైన మద్దతు ధర కల్పించి, సరైన సమయంలో ధాన్యం కొనుగోలు చేసి పారదర్శక వ్యవస్థను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, వి.బి.కె.వి.సుబ్బారావు, డీసీచైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, పాలేటి ఆంజనేయులు, పామర్తి సత్తిబాబు,పెన్నేరు రమేష్, కౌతవంరం పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి యుగంధర్, వడ్లమన్నాడు పీఏసీఎస్ చైర్మన్ బాబి, తూము పద్మజ, ఈడే కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వడ్లమన్నాడులో వరిచేనును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

క్రీడలతోనే ఒత్తిడిని దూరం చేయొచ్చు

- మాజీ మంత్రి నెట్టెం రఘురామ్

గుడివాడ, నవంబరు23(ఆంధ్రజ్యోతి) : పని ఒత్తిడిని తగ్గించేందుకు కేడీసీసీ బ్యాంకు ఉద్యోగులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమని, ఉద్యోగుల్లో ఎంతో ఉత్సాహానిస్తాయని కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ అన్నారు. ఆదివారం స్థానిక నందమూరి తారకరామారావు క్రీడా ప్రాంగణంలో గుడివాడ డివిజన్‌స్థాయి డీసీపీసీ బ్యాంకు పరిధిలోని 11 బ్రాంచ్‌లలోని 103 సొసైటీ ఉద్యోగులకు గుడివాడ డీసీపీసీ ఏజీఎం మాటూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 21,22,23 తేదీల్లో క్రికెట్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు నిర్వహించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడితో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇలాంటి క్రీడలు ఒత్తిడిని తగ్గించేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. జిల్లా స్థాయిలో కాకుండా రాష్ట్రస్థాయిలో సైతం ఉద్యోగులకు క్రీడలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్కాకర రావు, బ్యాంకు సీఈవో శ్యామ్, జి.ఎం చంద్రశేఖర్, డీజీఎం ప్రభాకర్, బజారు బ్రాంచ్ మేనేజర్ ఎం.సాంబశివరావు, కూటమి నాయకులు సత్యనారాయణ, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్

కనుమూరు ముఖద్వారానికి భూమిపూజ

- ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కనుమూరుకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యుడు యలమంచిలి శివాజీ పేరుతో గ్రామంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త యలమంచిలి వాసుదేవరావు సహకారంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ ముఖద్వారానికి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కూటమిశ్రేణులతో కలసి ఆదివారం భూమిపూజ చేశారు. శివాజీ స్వగ్రామమైన కనుమూరు అభివృద్ధికి ప్రభుత్వానికి సహయంగా, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పారిశ్రామికవేత్తలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన చూండూరి కృష్ణ కుటుంబాన్ని ఆదుకునేందుకు టీడీపీ నేతలు సమకూర్చిన రూ.50వేల నగదును పీ4 పథకంద్వారా ఎమ్మెల్యే వర్ల కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న మురుగుడు క్రాంతికి మంజూరైన రూ. 20వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. అనంతరం జాతీయ రహదారిపై రైతులు ఆరబెట్టిన ధాన్యపు రాశులను పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా





తోట్లవల్లూరులోని యాదవుల రామాలయం రోడ్డులో నిర్మించిన డ్రెయిన్లు

రూ.5 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం

తోట్లవల్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో యాదవుల రామాలయం రోడ్డులో జడ్పీ నిధులు రూ. 5 లక్షలతో 150 మీటర్ల డ్రెయినేజీ నిర్మించారు. ఇక్కడ గతంలో సీసీరోడ్డు నిర్మించారు. కాని డ్రెయినేజీ సౌకర్యం లేకపోవటంతో స్థానికులు వాడే నీరు బయటకు పోయే మార్గం లేక ఇబ్బందులకు గురయ్యారు. దీంతో జడ్పీ నిధులతో డ్రెయినేజీ నిర్మించటంతో మురుగు సమస్య తీరిందని స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రెయిలింగ్స్ లేక ప్రమాదకరంగా మారిన కల్వర్టు

పొంచి ఉన్న ప్రమాదం

కూచిపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నుంచి చల్లపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో పోలీసు స్టేషన్‌కు ఎదురుగా ఉన్న కల్వర్టర్‌కు ఇరువైపులా సైడ్ వాల్స్ లేకపోవటంతో తరచూ ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. గతంలో కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్స్ శిథిలావస్థకు చేరటంతో వాటిని తిరిగి పునర్నిర్మించలేదు. ఆ ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవటం ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా రెయిలిం గ్ ఏర్పాటు చేయాల్సిందిగా వాహనదారులు కోరుతున్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర

తోట్లవల్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : భద్రిరాజుపాలెంలో ఆదివారం గంగానమ్మ, పోతురాజు జాతర వైభవంగా జరిగింది. గ్రామంలోని రైతులు అమ్మవారికి కొత్త బియ్యంతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పంటలు సమృద్ధిగా పండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ గ్రామంలో గంగానమ్మ జాతర నిర్వహించిన తరువాత వరి కోతలు ప్రారంభించటం సంప్రదాయంగా వస్తోంది. దీంతో రైతులు ఎడ్లబండ్లను, ఎద్దులను, ట్రాక్టర్లను అందంగా అలంకరించి గంగానమ్మ గుడి చుట్టూ తిప్పారు. కొందరు వైసీపీ, టీడీపీ అభిమానులు ఆయా పార్టీల జెండాలను అలంకరించారు. గంగానమ్మ గుడి వద్ద భక్తుల సందడి నెలకొంది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



భద్రిరాజుపాలెంలో గంగానమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పేకాట శిబిరంపై దాడి

- రూ.7వేలు స్వాధీనం

గుడివాడ, నవంబరు23(ఆంధ్రజ్యోతి) : స్థానిక పెదఎరుకపాడులో ఆదివారం పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టూటౌన్ ఏఎస్ఐ జయబాబు ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.7,000లు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.



తుమ్మల రాంబ్రహ్మం పార్కులో ఏర్పాటుచేస్తున్న రైతుబజారు

పార్కులోకి రైతుబజారు రేపటి నుంచి

గుడివాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతుబజారులో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా తుమ్మల రాంబ్రహ్మం మున్సిపల్ పార్కులోకి రైతుబజారును మార్చారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియంలోకి, చిన్న వ్యాన్‌ల పార్కింగ్ రహదారిలోకి మార్చాలని నిర్ణయించుకున్నారు. మొత్తం 150 కురగాయల స్టాళ్లు ఉండటంతో రాంబ్రహ్మం పార్కుకు తరలించారు. రైతుబజారులో రూ.16లక్షల వ్యయంతో ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, కార్యాలయం వంటి అభివృద్ధి పనులు చేపడుతున్న దృష్ట్యా పార్కులోకి మార్చినట్లు రైతు బజారు ఈవో అమీర్ తెలిపారు.

వాతావరణంలో మార్పులు .. ఆందోళనలో అన్నదాతలు



యంత్రాలతో కోతలు పూర్తి చేసుకుంటున్న అన్నదాతలు

గుడివాడ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు వర్ష సూచనలు తెలియజేయటంతో వాతావరణం మబ్బులు పట్టి ఉండటంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసిన వరి పనలను హడావిడిగా కుప్పలు వేసుకుంటున్నారు. చాలా మంది రైతులు ఆదివారం తమ పొలంలోని వరి పనలను పచ్చిగా ఉన్న పంటను దక్కించుకోవటానికి కూలీలతో వరి కుప్పలు వేస్తున్నారు. కొంత మంది రైతులు మిషన్ల ద్వారా కోసినవి రోడ్ల మీద, పొలం గట్ల మీద పోసిన వాటిని త్వరగా ఇళ్లకు చేర్చుకుంటున్నారు. ఆరిన ధాన్యాన్ని ఆర్ఎస్‌కేలకు తరలిస్తున్నారు. మొత్తం మీద వాతావరణ మార్పుల వల్ల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. మొంథా తుఫాన్‌తో రైతులకు చాలా నష్టం వాటిల్లింది. ఇప్పుడు వరి కోతలు, కుప్పలు, నూర్పిళ్ల సమయంలో వర్షం కురిస్తే అపార నష్టం వాటిల్లుతుందని తెలిపారు. వరి కోతలు వాయిదా వేయాలని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. కొంచెం వర్షం వచ్చిన వరి పంట పాడవుతుందని అంటున్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని రక్షించుకోవటానికి అనేక రకాలుగా ప్రయత్నం చేస్తున్నారు.

పామర్రు : ఆరుగాలం శ్రమించి పండించిన పంటలపై ఎంతో ఆశలు పెట్టుకున్నా అన్నదాతల ఆశలపై తుఫాను హెచ్చరికలు వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. దీంతో రైతులు ఏం చేయాలో అర్థకాక అఘమేఘాలపై వరికోతలను అందుబాటులో ఉన్నా కూలీల తోపాటు యంత్ర పరికరాలతో యుద్ధ ప్రాతిపాదికన కోతలు, నూర్పిళ్లు ను ఆదివారం ముమ్మరం చేశారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫాను ప్రభావం వల్ల ఈదురుగాలులుకు దాదాపు పరిపక్వతకు వచ్చిన 30 శాతం వరి చేలు నేలకొరిగాయి. వాటిని కోసేందుకు యంత్రాలు పనిచేసే పరిస్థితి లేకపోవడంతో ఎకరానికి రూ.12వేలు(అధికదరలు) కోతలు కోసేందుకు రైతులు వెచ్చించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత నాలుగు రోజులనుంచి ధాన్యంకోతలు, నూర్పిళ్లు పనులు పూర్తిచేసుకుని బస్తాల్లో నింపి రవాణా వాహనాలు అందక రోడ్లపై దాన్యంబస్తాలను నిల్వచేసి ఆకాశం వైపుచూస్తూ రైతులు కాలం గడుపుతున్నారు.



మబ్బులు కమ్మటంతో హడావిడిగా కుప్పలు వేస్తున్న రైతులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 660


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి

పేదల వైద్యానికి ప్రాధాన్యం

అవనిగడ్డ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల వైద్యానికి సీఎం చంద్రబాబు నాయుడు అత్యధిక ప్రాముఖ్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు రూ.12.7 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను ఆయన అందజేశారు. మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సత్యసాయి

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా సేవలు అజరామరంగా నిలిచిపోయాయని ఇనగుదురు సీఐ పరమేశ్వరరావు అన్నారు. సత్యసేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో జరిగిన సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించి ప్రసంగించారు. సత్యసాయిబాబా దివ్య సమాధి పొందినప్పుడు తాను విధులు నిర్వహించే అవకాశం లభించడం మహద్భాగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టికుమారి తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నం మార్కెట్‌యార్డులో సత్యసాయి చిత్రపటానికి మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని పూలమాలలు వేసి నివాళులరించారు. కుంచే నాని మాట్లాడుతూ, విద్యారంగానికి సత్యసాయిబాబా అపారమైన సేవలు చేశారన్నారు. **పెడన** : సత్యసాయిబాబా మందిరంలో ఓంకారం, సుప్రభాతం, రుద్రా భిషేకం, మహామంగళ హారతి, ఊయల సేవ నిర్వహించారు. బాల వికాస్ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నారాయణ సేవ నిర్వహించారు. వృద్ధులు, నిరుపేదలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. **అవనిగడ్డ రూరల్** : చిరువోలులంకలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబాచిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. దక్షిణ చిరువోలులంక, రామచంద్రపురం, మాచవరం మీదుగా ఊరేగింపు నిర్వహించిన అనంతరం గ్రామంలోని సత్యసాయి భజన మందిరంలో సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు సత్యసాయిబాబా భక్తులు పాల్గొన్నారు. **ఘంటసాల** : భగవాన్ సత్యసాయి శతజయంతి వేడుకలను ఘంటసాలలోని సాయి మినీ కళ్యాణ మండపంలో ఆదివారం ఘనం గా జరిపారు. నగర సంకీర్తన, గ్రామోత్సవం, అన్నసమారాధన జరిగాయి.


సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఐ పరమేశ్వరరావు, అవనిగడ్డలో సత్యసాయికి నివాళులర్పిస్తున్న బుద్ధప్రసాద్

గొప్ప మానవతామూర్తి : మండలి

అవనిగడ్డ : దివిసీమ ప్రాంతానికి పుట్టపర్తి సత్యసాయి బాబా చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పుట్టపర్తి సాయిబాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఈ ప్రాంత పునర్నిర్మాణానికి సాయమందించిన మానవతా మూర్తుల్లో సత్యసాయి సేవాదళం పాత్ర మరువలేనిదన్నారు. తన జన్మదిన వేడుకలను నిలుపుదల చేసి విపత్తుల్లో ఉన్న వారికి సేవలు అందించటం అందరి ధర్మమని పిలుపునిచ్చారన్నారు. సత్యసాయిబాబా చిత్రపటానికి, మండలి వెంకట కృష్ణారావు విగ్రహాల వద్ద బుద్ధప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. మండలి వెంకట్రామ్, సత్యసాయిబాబా సేవా సమితి ప్రతినిధులు రుషికేశ్వర్, సనకా నాగమునీశ్వరరావు, బావిశెట్టి లక్ష్మరావు, రఘువీర్, పార్వతీ, లక్ష్మీ, కొడాలి నాగరాజు, గోపి, మహేష్, ఆర్.మహేష్, కైలా వెంకటేశ్వరరావు, సత్యసాయి తదితరులతోపాటు మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకల కమిటీ, గాంధీక్షేత్ర కమిటీలు పాల్గొన్నాయి. పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా సేవా సమితి వారు వస్త్రదానం చేశారు. ప్రగతి విద్యాసంస్థ ఆవరణలో 20 మంది గ్రామపంచాయతీ కార్మికులకు వస్త్రాలు, 40 మంది నిరుపేద ఎస్టీలకు దుప్ప ట్లు, టవల్స్ అందజేశారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, సేవా సమితి నిర్వాహకులు సనకా నాగము నీశ్వరరావు, లక్ష్మణరావు, రామ్మోహనరావు, రఘువీర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి దివ్య మహా పడిపూజ


కోనేరుసెంటరులో జరిగిన అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో ఆదివారం రాత్రి దివ్యమహాపడిపూజ వైభవంగా జరిగింది. దీక్షాపరుల అయ్యప్పనామ స్మరణతో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరిసింది. కేరళ తంత్రి మురళీధరన్ నంబూద్రి నేతృత్వంలో నరసరావుపేటకు చెందిన కుమార్ గురుస్వామి, ఊసా వెంకటేశ్వరరావు గురుస్వామి, ఆమంచి వాసుదేవ హనుమంతరావు గురుస్వామి పడిపూజా వైభవంగా జరిగింది. 25 అడుగుల ఎత్తయిన పదునెట్టాంబడి భక్తులకు శబరిమలను సాక్షాత్కరింపజేసింది. మంత్రి కొల్లు రవీంద్ర పడి పూజలో పాల్గొన్నారు.


3కె రన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

నడక, పరుగుతో ఆరోగ్యవంతమైన సమాజం

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరికీ నడక, పరుగు ఎంతో అవసరమని ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 11న ఉదయం నిర్వహించే 3కె రన్ వాల్‌పోస్టర్‌ను ఎస్పీ ఆదివారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు 3కె రన్ దోహదపడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నిర్వాహకులు సందీప్ మాట్లాడుతూ, ఈ రన్‌లో పాల్గొనే వారిలో 25 మందికి లక్కీ డిప్ ద్వారా రూ.5 వేలు చొప్పున బహుమతులు అందిస్తామన్నారు.


బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ కరపత్రాన్ని వేదవ్యాస్‌కు అందజేస్తున్న బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్

బ్రాహ్మణులను ఆదుకున్నది చంద్రబాబు మాత్రమే

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేదబ్రాహ్మణులకు ఆదుకునేందుకు మొట్టమొదటగా సీఎం చంద్రబాబు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. బూరగడ్డ వేదవ్యాసను బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్ కలిసి బ్రాహ్మణ సహకార సంఘం కరపత్రాలను అందజేశారు. బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా అడిగిన ప్రతి ఒక్క బ్రాహ్మణునికి రుణాలు అందిస్తున్నామని ఫణికుమార్ తెలిపారు. బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో బ్రాహ్మణులను రాజకీయంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్చకుల జీతాలు పెంచారన్నారు. బ్రాహ్మణ సంఘ నాయకులు లక్కావఝుల రామకృష్ణ, తంగిరాల మిథున వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.


గిరిజన రౌండ్‌టేబుల్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గిరిజన సమాఖ్య జాతీయ అధ్యక్షుడు శంకరనాయక్

గిరిజనులకు మరిన్ని సీట్లు కేటాయించాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజనులకు మరిన్ని సీట్లు కేటాయించాలని గిరిజన సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు ఎం శంకరనాయక్ డిమాండ్ చేశారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో గురువారం గిరిజనుల రౌండ్ టేబుల్ సమావేశం వాల్ పోస్టర్లను శంకర్‌నాయక్ ఆవిష్కరించి మాట్లాడారు. జనాభా దామాషా మేరకు గిరిజనులకు మరిన్ని సీట్లు రిజర్వు చేయాలన్నారు. గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లభించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. గిరిజన విద్యార్థులందరికీ ఆధార్ కార్డులు మంజూరు చేయాలన్నారు. గిరిజన హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 30 వతేదీ ఉద యం 10 గంటలకు ఎన్‌కన్వెన్షన్ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర యువజన సమాఖ్య నాయకులు హనుమంతు నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సమీర్ నాయక్, అంజినా నాయక్, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.



రంగుల అలంకరణకు బందరుకు పైడమ్మ

పెడన, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 4 నుంచి 14 వరకు జరగనున్న జాతర ఉత్సవాలను పురస్కరించుకుని రంగుల అలంకరణ కోసం పైడమ్మ అమ్మవారు ఆదివారం బయలుదేరి మచిలీపట్నం వెళ్లారు. జాతర ఉత్సవాలకు ముందు రంగుల అలంకరణ నిమిత్తం పైడమ్మమచిలీపట్నం వెళ్ళడం ప్రతియేటా ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం ఉదయం పైడమ్మ అమ్మవారిని ఆలయం నుంచి బయటకు తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అధిష్ఠింపచేసి మేళతాళాలతో ఊరేగింపుగా మచిలీపట్నం తీసుకువెళ్లారు. ఈవో జి.వి. కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ట్రస్టు బోర్డు సభ్యులు మల్లంపల్లి శ్రీనివాసరావు, కోమట్ల సాం బశివరావు, దాసు శ్యామ్, కోరుమిల్లి వెంకటస్వామి, సేనాపతి వెంకటరమణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చందన నారాయణరావు, శ్యామలాంబ ఆలయ కమిటీ సభ్యుడు కర్నా మోహనరావు పాల్గొన్నారు.

బొండాడ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

అవనిగడ్డ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభావంతులను ప్రోత్సహించేలా బొం డాడ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బొండాడ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బొండాడ నీలిమ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతులమీదుగా 82 మందికి రూ.6 లక్షల స్కాలర్ షిప్ అందజేశారు. రాయల్ సర్వీస్ ట్రస్ట్ ట్రస్ట్ చైర్మన్ సీతాళం రాంబాబు, కార్యదర్శి తోట పద్మనాభరావు, కోశాధికారి అంకం రామసాయి ప్రసాద్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఓసూరి బాలబాలాజీ, మండలి వెంకట్రామ్, బొండాడ బిపిన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ జిల్లా పర్యావరణ ప్రముఖ్ వంగర శేషగిరిరావు బొండాడ ఫౌండేషన్ సహకారంతో రూ.25 వేల విలువైన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఆరోగ్య భారతి ప్రతినిధులు గుడిసేవ విష్ణుప్రసాద్, తుంగల వెంకటగిరిలకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, బొండాడ నీలిమల చేతుల మీదుగా అందజేశారు.



స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

డాక్టర్ శ్రీనివాసాచార్యకు విశిష్ట సేవా అవార్డు

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశంలో మచిలీపట్నానికి చెందిన ప్రముఖ డాక్టర్ బి. శ్రీనివాసాచార్యకు విశిష్ట సేవా అవార్డు అందుకున్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యకు నూతనంగా ఎన్నికయిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్. బాలరాజు, ఐఎంఏ ప్రతినిధులు కోసూరు ఫణికుమార్, పూర్ణచంద్రరావు, కేశవకృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


ఐఎంఏ అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాసాచార్య

గురుకులంలో ఎన్‌సీసీ దినోత్సవం

అవనిగడ్డ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ గురుకుల విద్యాలయంలో ఎన్‌సీసీ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ కేడెట్లు కవాతు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కనపర్తి జాన్, వ్యాయామ ఉపాధ్యాయులు గుంటూరు వీరకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఎంవీకేకు రేమాలవారిపాలెం నేతల నివాళి

నాగాయలంక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రేమాలవారిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షురాలు కైతేపల్లి కోటేశ్వరమ్మ 112వ రోజు ఆదివారం నాగాయలంకలో దివంగత మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెండు లక్ష్మణరావుతోపాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

పులిగడ్డ జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్లు

అవనిగడ్డ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ప్రమాదాలకు గురయ్యే పులిగడ్డ జంక్షన్ వద్ద రోడ్డు భద్రతను మెరుగుపర్చేందుకు ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాస్ చొరవతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ చర్యతో ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు.





హంసలదీవి బీచ్‌లో పర్యాటకుల కేరింతలు

కోడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి బీచ్ వద్ద పర్యాటకులు కేరింతలు కొడుతూ గడిపారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది పర్యాటకులు కుటుంబసమేతంగా విచ్చేసి సముద్రతీరంలో స్నానాలు చేశారు. మెరైన్ ఎస్సై పూర్ణ మాధురి పర్యవేక్షణలో తీరం వెంబడి సిబ్బంది గస్తీ నిర్వహించారు. హంసలదీవి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని దర్శించి పర్యాటకులు తిరుగు ప్రయాణమయ్యారు.

రహదారి అధ్వానం..దిగబడిన ట్రాక్టర్

మోపిదేవి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి నుంచి పెదకళ్లేపల్లి వరకు ఉన్న జిల్లా పరిషత్ రహదారి అధ్వానంగా మారటంతో వెంకటాపురం వద్ద శనివారం రాత్రి గోతుల్లో ధాన్యం ట్రాక్టర్ దిగబడింది. రెండు ట్రాక్టర్లు తీసుకొచ్చి దిగబడిన ధాన్యం ట్రాక్టర్‌ను లాగేందుకు గంటల తరబడి ప్రయత్నించినా రాకపోవటంతో విసుగు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రాత్రి అక్కడే వదిలేశారు. ఆదివారం ఉదయం మరొక ట్రాక్టర్‌ను తీసుకొచ్చి కొంతమేర ధాన్యం బస్తాలను వేరొక ట్రాక్టర్‌పై వేసి దిగబడిన ట్రాక్టర్‌ను గోతిలో నుంచి బయటకు తీశారు. మోపిదేవి నుంచి రావివారిపాలెం, బోడగుంట, వెంకటాపురం, పెదకళ్లేపల్లి వరకు ఏడు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి గోతులు పడి ఉండటంతో ధాన్యం రవాణా చేసేందుకు రైతులు హడలెత్తుతున్నారు. రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సీతాయిలంకలో ఉచిత వైద్యశిబిరం

అవనిగడ్డ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీతాయిలంకలో దివంగత మేడికొండ శ్రావ్య జ్ఞాపకార్థం శ్రావ్య తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యం - సుభాషిణి ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ ఎం.శ్రావణ్ కుమార్, ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ వెంకటేశ్వరరావు, కంటి వైద్య నిపుణులు డాక్టర్ శైలజ, ఈఎన్‌టీ సర్జన్ సమీర, డాక్టర్లు కిరణ్, సంగీతరావు, మోహనరావు, విశ్వశాంతి, విష్ణుమోహన్, రత్న ప్రభాకర్, శ్రావణి తదితరులు వైద్యసేవలు అందించారు. సీతాయిలంక ప్రజలు పెద్ద సంఖ్యలో శిబిరంలో పాల్గొన్నారు. బుస్సా కోటేశ్వరరావు, తెనాలి భగవంతరావు, నాదెళ్ల వెంకటరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బుసక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నాగాయలంక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శనివారం రాత్రి 8 గంటల సమయంలో నాగాయలంకలో ఎటువంటి అనుమతులు లేకుండా బుసక తరలిస్తున్న కనిగంటి శ్రీనివాసరావుకు చెందిన రెండు ట్రాక్టర్లు, వక్కపట్లవారిపాలెం గ్రామానికి చెందిన అంబటి లక్ష్మణ ప్రసాద్‌కి చెందిన టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని తదుపరి చర్య నిమిత్తం మైనింగ్ శాఖకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

లకనం నాగాంజనేయులుకు నేతల పరామర్శ

నాగాయలంక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు మాతృమూర్తి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లకనం శారదాంబ ఇటీవల మృతి చెందారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు శారదాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు బొబ్బా గోవర్ధన్, పరుచూరి దుర్గా ప్రసాద్, మేడికొండ విజయ్, కర్రి కృష్ణమూర్తి, లంకే శ్రీనివాస ప్రసాద్, నాగిడి తాతారావు, విశ్వనాథపల్లి భిక్షం, జిల్లా సంఘం అధ్యక్షుడు నాగ రమేష్, మత్స్యకార సంఘాల నాయకులు చెన్ను గురుమూర్తి, ఒడుగు రామచంద్రరావు, గాడి స్వామి తదితరులు పాల్గొన్నారు.



అర్తమూరు పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత మృతి

బంటుమిల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : అర్తమూరు ఎలిమెంటరీ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా పని చేస్తున్న పొట్ల స్వర్ణలత (59) ఆదివారం గుండెపోటుతో మరణించారు. మచిలీపట్నంలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆమె భర్త జోన్స్ కుమార్ కూడా ఉపాధ్యాయ వృత్తిలో పని చేసి పదవీవిరమణ చేశారు.



విద్యుత్ సిబ్బంది అప్రమత్తం

నాగాయలంక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. పలు వీధుల్లో విద్యుత్ స్తంభాలు రిపేరుతోపాటు తీగెలను ఆనుకుని ఉన్న కొబ్బరి మట్టలను, చెట్ల కొమ్మలను సిబ్బంది ముందస్తుగా నరికి తొలగిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలం మాజేరు సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచీ 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ డీఈ పులి శివనాగేశ్వరరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో బే ఎక్స్‌టెన్షన్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామనీ, వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఉచితంగా బీఎండీ పరీక్షలు నేడు

చల్లపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో 50 సంవత్సరాలు దాటిన వారిలో వచ్చే అస్టియోపోరోసిస్ (ఎముకుల బలహీనత) వ్యాధిని గుర్తించేందుకు బోన్ మినరల్స్ డెన్సిటీ(బీఎండీ) పరీక్షలు సోమవారం ఉచితంగా చేయనున్నట్లు సీఆర్ ట్రస్ట్ ప్రతినిధి అడ్డాడ ప్రసాద్ బాబు తెలిపారు. ఫోర్బ్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకూ ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.